ఇన్‌డెసిషన్'గా మన నాయకులైతే ఏమాత్రం లాభంలేదు.

'స్వారీ చెయ్యటం చేతకాని నాయకులను గుఱ్ఱం దింపటానికి వచ్చాను. నాకు పదవి కావలసి నేను రాలేదు. గుఱ్ఱాన్ని అదుపుచేసుకో గలిగినవాళ్ళకే నాయకత్వం అంద జెయ్యటం నా కర్తవ్యం' అని అంటోంది శ్రీమతి విజయలక్ష్మి పండిట్.

ఏం జరుగుతుందో, యెలా జరుగుతుందో వేచిచూడాలి.

## రాష్ట్ర రాజకీయం

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ తిమ్మారెడ్డి, ఆహారమంత్రి శ్రీ బలరామిరెడ్డి 'దూషణ భూషణ తిరస్కారాల' బేరీజులతో పత్రికా ముఖాన ప్రత్యక్ష మయారు. ఇద్దరిదీ చాలా కాలపు సంబంధంట. ఇద్దరిదీ ఒకే జిల్లా. వారిని గురించి వారిలోవారికి తెలిసినంతగాబయటివారికితెలియదు. అందుకే వారు అనుకుంటుంటే మనం వినాలి; చెబితే మనం ఆలకించాలి.

ముఖ్యంగా వ్యవసాయ శాఖలో జరిగే అవకతవకలు విమర్శించి, ఆ శాఖ మంత్రి వర్యులను పరోక్షం గానే, ఘాటుగా శ్రీ తిమ్మారెడ్డి విమర్శిస్తే, అంతకు రెట్టింపు స్థాయిలోనే వ్యవసాయమంత్రి శ్రీ బలరామిరెడ్డి సమాధానం చెప్పారు.

ఇంతకుముందు ఒకమారు బహిరంగంగానే శ్రీ తిమ్మారెడ్డి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డితో 'పాలిసీ మేటర్స్'లో ఘర్షణ పడ్డారు.

చిత్రం యేమిటంటే శ్రీ తిమ్మారెడ్డి, శ్రీ సుబ్బారెడ్డి, శ్రీ బలరామిరెడ్డికూడా మూలవిరాట్ శ్రీ సంజీవరెడ్డివారి ముఖ్య శిష్యులు, అనుంగు శిష్యులుకూడా. అందుకే యెవరు యేమనుకుంటున్నా యెంత బహిరంగంగా అనుకున్నా ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి మాత్రం 'దారుభూతోమరారి' అన్నట్లు కిమిన్నాస్తి దేముడులాంటి మనిషి.

## "గుర్తింపు……"

ఇది వార్త—రాజస్తాన్‌లో ఒక ఉద్యోగిని ఒకచోటునుంచి మరొకచోటుకు బదిలీ చేశారు. కొత్త చోటుకు వెళ్ళి చేరాలంటే కొత్తవాళ్ళు అయన్ను గుర్తించలేదుట. ఏడుసంవత్సరాలు గడిచి మొన్న రాజస్తాన్ శాసనసభలో ఈవిషయం ప్రస్తావనకువస్తే'ఇప్పుడైనా ఆయన్ను గుర్తించి' ఉద్యోగంలో చేర్చుకోండని విద్యామంత్రి ఉత్తర్వు వేశారట.

—అనంతం.






# అత్తగారూ — అష్టావధానం

భానుమతీ రామకృష్ణ

ప్రతిరోజూ ప్రొద్దుటే మెళకువ రాగానే మా అత్తగారు "కౌసల్యా సుప్రజారామా" అంటూ లేస్తారు - కండ్లు కూడా తెరవకుండానే దారి తడుముకుంటూ వంటింటివైపు వెళ్తారు.

భోజనాల గదికీ, వంటింటికీ మధ్య ప్లేట్లూ, కప్పులూ, సాసర్లూ పెట్టే షెల్ఫుంది…ఆ షెల్ఫుమీద ఒక మట్టిబొమ్మ వుంది … కంసుడి గుండెలమీద కృష్ణుడు కూర్చుని పీక నొక్కి చంపుతూంటే, కంసుడు గుడ్లు తేలేసి బేర్‌మంటూ అసహాయ స్థితిలో మన వైపు చూస్తుంటాడు… ఆ బొమ్మ కొలువులో పెట్టే దశావతారాల్లో కృష్ణావతారం-చాలా పాతదైందని చేతులూ కాళ్లూ విరిగిన బొమ్మల్లో పడేశాను… అందువల్లే కంసుడికో కాలులేదు…కృష్ణుడికో వేలు లేదు … అయినా మా అత్తగారికి ఆ బొమ్మంటే ప్రాణం… అందుకే ఆ పాత బొమ్మల్లోనుంచి తీసి 'షెల్ఫు మీద పెట్టారు… నేరుగా ఆ బొమ్మ ముందు కెళ్ళి కండ్లు తెరిచి నమస్కారం చేసేవారు.

నాకో సందేహం కలిగేది- ఆవిడ నమస్కరించేది చచ్చిపోతున్న కంసుడికా! చంపుతున్న కృష్ణుడికా! అని.





కండ్లు తెరుస్తూనే ముందు కనబడేది కంసుడే!—

ఎంత రాక్షసుడైనా కృష్ణుడికి మేనమామే గనక కంసుడుగూడా గొప్పవాడేనని మా అత్తగారు తేల్చి చెప్పిందాకా నాకర్థంగాలేదు.—

ఒకరోజు ఆమె కంసుడికి నమస్కారం చేస్తుండగా మా పెరటిగోడ వెనకనుంచి చక్కటి సన్నాయి మేళం వినిపించింది.— ప్రొద్దుటే మంగళ వాద్యం చెవుల పడగానే మాఅత్తగారి ఒళ్ళు పులకరించి ఆనందంతో పరవశం చెందారు—


మా పెరటి వెనకాలవున్న పోరంబోకు స్థలంలో చాలా గుడిసెలు లేచాయి— వాటిలో మంగలి వాళ్ళెవరో క్రొత్తగా చేరినట్లున్నారు.

మా అత్తగారు సంతోషపడి పోతూ చెప్పారు ... ... "నీకు చెప్పానో లేదో; నేను ?... ...చిన్నప్పుడు నేను పుట్టిన పల్లెటూళ్ళో గూడా, మా పెరటివెనకనే కాపురం వుంటూండేవాళ్ళు చాకలివాండ్లూ, మంగలివాండ్లూనూ... ...మా తాతగారూ, అవ్వగారూ, యింటికి మంగళకరంగా వుంటుందని, ప్రతి శుక్రవారంనాడూ ఆ మంగలివాళ్ళనొచ్చి వాకిటిముందు కాసేపు మంగళ వాద్యం వాయించి వెళ్ళమనేవారు... ...ఇంక వాళ్ళుఎంత బాగా మేళం వాయించేవాళ్ళంటే మా తాతగారూ, అవ్వగారూ ఆనంద బాష్పాలొదిలేవాళ్ళు — అదంతా జ్ఞాపకంవస్తోంది — అనుకోకుండా మన పెరటివేపుగూడా మంగలివాళ్ళెవరో కొత్తగా చేరారు—ఇక్కడ శుక్రవారమే గాకుండా ప్రతిరోజూ లక్షణంగా మంగళవాద్యం వింటూండొచ్చు—వాళ్ళు వచ్చినవేళా విశేషం మనింట్లోగూడా ఏదైనా శుభకార్యం అయితే"—అని మాఅత్తగారు ముగించకముందే ఆ గుడిసెల్లోనుంచే గాడిదరిచింది — ఇక ఆమె ఆనందానికి అంతం లేకుండా పోయింది—





గాడిద అరిస్తే ఏదనుకుంటే అది వెంటనే ఫలిస్తుందంటారు ... ఆగాడిద మా పెరటి వెనకనే చేరింది. "ఒసేవ్! ఎవరో చాకలి వాళ్ళు గూడా మన పెరటి వేపు గుడిసెల్లో చేరినట్లున్నారేవ్!... అన్నట్లు నా చిన్నప్పుడు మా యింట్లో పక్కలేసేదీ, బట్టలుతికియింటిపట్టునేవుండి అన్ని పన్లూ చేసేదీ చాకలివాడే... మనం ఈ పనివాళ్ళతో బాధపడి పోతున్నాం. రాహుకాలం, వర్జం లేకుండా చూసి ఆ చాకలివాళ్ళకు కబురుపెట్టాలి ఎవడైనా ఇంట్లో పనికి కుదుర్తాడేమో" అని మా అత్తగారు అంటుండగానే భోజనాల గదిలో గడియారం రెండు గంటలు కొట్టింది.



"ఇదేమిటే మళ్ళీ ఏమొచ్చింది దీనికి!... గంట ఏడవుతుంటే రెండుగొట్టి వూరుకుందేం?..." అంటూ భోజనాల గదిలో కెళ్లారు మా అత్తగారు...

ఆ గడియారం మా అత్తగారి పుట్టింటి కానుక— అందుకే ఆ గడియారం అంటే ఆమెకు ప్రాణం — లోపల అంకెలు మాసిపోయి రెండు ముళ్ళూ సగందాకా విరిగిపోయి శిధిలావస్థలో నీరసంగా గోడకు వేళ్ళాడుతున్న ఆ గడియారం చూస్తుంటే సిలువకు కొట్టబడిన ఏసుక్రీస్తు జ్ఞాపకం వస్తాడు— ఆ గడియారానికి "కీ" యివ్వడం మా అత్తగారి అభిమాన పాత్రుడైన డ్రైవరు తాత ఒక్కడికే తెలుసు– అతను ఉబ్బసం వ్యాధితో నెలకు పదిహేను రోజులు పనికిరాడు. ఇక ఆ గడియారానికి "కీ" యిచ్చే నాధుడుండడు ... కరెక్టుగా "కీ" యిస్తుంటేనే ఒకటిన్నర గంటలు లేటుగా నడుస్తుంటుంది — "కీ" యివ్వడంఒక్కరోజు లేటయినా యిక దానికి మతిపోతుంది — కాని ఆగిపోదు— అదీ మా అత్తగారు మెచ్చుకొనే ఆ గడియారం యొక్క గొప్పతనం—

ఆ గడియారం గంటలు కొ... ముందు సంగీతం పాడుతుం... దానికి 'కీ' అయిపోయిందని ... కోడానికి ఒకటే గుర్తు. దాని సంగీతం...

తాగిన వాడి పాడినట్టుంటుంది ... గంటలు మత్తుగా కొడుతుంది ... రెండు ముళ్లూ అంకెల మీద తూలుతూ నడుస్తాయి ... అల్లాంటప్పుడు వున్నట్టుండి ఆ గడియారానికి 'ఫిట్స్' వొస్తుంటాయి ... టైమ్ ఒంటిగంట చూపుతుంటుంది. ఎక్కడలేని స్పీడుతో వరసన యిరవై గంటలు కొట్టేస్తుంది ... కాసేపుండి నీరసంగా ఆరు గొట్టి వూరుకుంటుంది. మామూలుగా గంటలుకొట్టే ముందు పాడే సంగీతం గంటలు కొడుతూ పాడుతుంది జాలీగా ... దాన్ని రిపేరు కివ్వబోతే ఏ గడియారం కంపెనీవాళ్ళూ తీసుకోలా ... అందరూ ఒక్క నమస్కారంపెట్టి దాన్ని మ్యూజియంలో పెట్టమన్నారు ... అక్కడెందుకులే నాఘటుం వున్నన్నాళ్ళూ, యిక్కడే వుండనిమ్మన్నారు మా అత్తగారు ...

ఎక్కడానయంగాని కేసుల్ని చివరకు "హోమియోపతి" వైద్యానికి వదిలినట్టు, ఇక అంతకంటె చెడదుగదా అని మా డ్రైవరు తాతే కారు రిపేరుచేసే పనిముట్లతో ఆ గడియారం రిపేరు చేశాడు — అప్పట్నుంచీ మిగతా గడియారాలకంటే ఒకటిన్నరగంటలు లేటుగా నడవడం మొదలెట్టింది ... ...

దానిగంట నమ్ముకుని చాలాసార్లు మా అత్తగారు అర్ధరాత్రివేళ లేచి పద్దు తోముకుని, పాలవాణ్ణి లేపి పాలు పిండమని నానా గొడవా చేశారు ... ... అప్పట్నుంచీ పనివాళ్ళందరికీ ఆ గడియారం అంటే ఒళ్ళుమంట ... ... దానివైపు కన్నెత్తికూడా చూడరు ... ... 'అదేం గడియారం అమ్మా? అస్తాయిస్తాన బడ్డది ... తీసి దిబ్బలో పారెయ్యాల్సిందే ... ...' అంటారు. ఎవరెన్నిజెప్పినా మా అత్తగారుమాత్రం ప్రొద్దుటే ఆ గడియారం ఒకసారి చూడకుండా వెళ్ళరు ... ... 'దీని 'కీ' అయిపోయిందేవ్! ... ... ఆ ఉబ్బసం వెధవ రాలేదులావుంది ... ... అన్నట్లు ఏకాదశి ఎప్పుడే! ...' అంటూ పంచాంగం ముందేసు కూర్చున్నారు—

ఆమెకు పంచాంగం చూట్టంఅంటే చాలా సరదా—పదేళ్ళనాటి పంచాంగాలుకూడా అమె దగ్గరుంటాయి ... తీరిక సమయాల్లో అన్ని పంచాంగాలూ ముందేసుకుని ఏ యే సంవత్సరంలో గ్రహణం ఎవరెవరికి పట్టిందీ, అధిక మాసాలు ఎప్పుడు వచ్చిందీ, కార్తె లెప్పుడు ప్రవేశించిందీ, తారాబలం, చంద్రబలం మొదలయిన వాటితోబాటు బల్లిపలుకులూ, తుమ్ముల ఫలాల వరకూ విడవకుండా చూస్తుంటారు ... దగ్గరున్న పది పంచాంగాల్లో ఒక్కొక్కసారి కొత్త పంచాంగం అనుకుని పాతపంచాంగం చూస్తుంటారు ... ఆ చూట్టంలో ఎల్లుండి ఏకాదశి అనుకొని ఏకాశిరోజు





భోంచేస్తుంటారు ... అలాగే పక్కింటావిడొచ్చి పంచాగం చూసి బిడ్డకి అన్నప్రాశనకి మంచి రోజు చెప్పమంటే హడావిడిలో పాత పంచాంగంచూసి పంచమి భేషుగ్గా వుందని చెప్పి అష్టమినాడు అన్నప్రాశన చేయించారు.

'అమ్మా! ...' అంటూ బయట వాకిట్లోనుంచి ఎవరో కేకేశారు.

'ఎవర్రా అదీ' అంటూ మా అత్తగారు హాల్లోకొచ్చారు ...

'నేనమ్మా సాకలోణ్ణి ... మనింటెనక గుడిసెల్లో వుంటుండా ...'

'ఓహో ప్రొద్దున్నే అరిచిన గాడిద నీదేనన్నమాట ... ... ఊ— ఏవూరు నీది!—' అన్నారు ఆడబోయిన తీర్థం ఎదురైందని సంతోషపడుతున్న మా అత్తగారు.

'మునపక్కే నమ్మా ...'


'అయితే ఏం యింతదూరం వచ్చావ్! ...'

చాకలివాడు కాస్త సిగ్గుపడి తలొంచుకుని చెప్పాడు ...

'ఎంతయినా పట్నంలో పనిజేసేదారి ఏరు ... అడ ఎంత రెక్కలిరునుకున్నా రాబడి గొర్రెతోకే గదమ్మా. మా సుట్టం ఒకడు యీ వూరొచ్చి పీనాదికూడా కాలా ... సిసీ మా కంపెనీల్లో పనిచేసి తెల్లారేసరికి యిల్లు గొన్నాడు' ... అని చాకలి చెప్తూంటే మా అత్తగారు నావైపు చూశారు ...

'ఓహో! అట్లాగా! సరే అయితే నువ్వుగూడా ఏ కంపెనీలోనో పనిజేసి సాయంకాలానికో యిల్లుగొను ... వెళ్ళిరా ...' అంటూ మా అత్తగారు వెనక్కి తిరిగారు ...

'అయ్యొయ్యో! అమ్మా! నే మాట సామెతకి జెప్పా ... గిసుకాద పని



జేయడానికనే నేనొచ్చింది... కోప్పడకండి .. ఏదైనాపనిప్పించండి" అంటూ ప్రాధేయపడ్డాడు చాకలి...

"అయితే యింటి పట్టునే వుండి యింటిపనన్నీ చేయాలి"... అని మా అత్తగారనే సరికి చాకలివాడి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డది. అయినా వేరే గత్యంతరం లేక ఒప్పుకున్నాడు...

మర్నాడే వచ్చి పనిలో చేరమన్నారు.
గాడిద అరిచింది...

మా అత్తగారు తృప్తిగా నిట్టూర్చారు...

మర్నాడుమామూలుగాకంససంహారంముందు నిలబడి నమస్కరిస్తూన్న మా అత్తగారికి మంగళవాద్యం వినిపించింద....... కాని మొదటిరోజులాగా కాకుండా ఇంకెవరోకొత్తగా నేర్చుకునేవాడు కూడా సన్నాయి వాయించడం మొదలెట్టాడు — ఆ నేర్చుకునేవాడెవడోకాని ప్పిప్పిప్పీ అంటూ శ్రుతిలో జేరకుండా అపశ్రుతులతో మా అత్తగారికి మతిపోగొట్టేశాడు... ...

"ఛీ ఛీ ఛీ ... ప్రొద్దుటే వీడెక్కడదాపరించాడే వెధవ శ్రాష్టం !... అసలు శ్రుతి తెలీని ఈ సన్యాసికి సన్నాయిమేళం ఎందుకూ అడుక్కుతిన్నూ !... అయినా నేర్చుకునే వెధవ వూరుబయటికెళ్ళి నేర్చుకోకూడదూ !... చుట్టుప్రక్కల కాపరాలుండేవాళ్ళ ప్రాణాలిట్లా తియ్యక పోతే !... లక్షణంగా మంగళవాద్యం వినవచ్చుగదా రోజూ అనుకుంటే ...బాగానేవుంది మేళం..." అంటూ చిర్రుబుర్రులాట్టం మొదలెట్టారు.




బయటు వాకిట్లో గాడిద అరిచింది... ...'చాకలివాడు వచ్చినట్టున్నాడు"...అన్నాను... ...

మా అత్తగారు బయటువాకిట్లో కెళ్ళారు... చాకలివాడికి పనులన్నీ పురమాయిస్తూండగా ఏదోటాక్సీవచ్చి ఆగింది...

పద్ధెనిమిదేండ్ల పిల్ల, ఆ పిల్లతల్లీ, పదేళ్ళ కుర్రాడూ దిగారు...

వాళ్ళను చూస్తూనే మా అత్తగారు ఎక్కడలేని సంతోషంతో "నువ్వంటే అలమేలూ!... నేనింకా ఎవరో అనుకున్నా-యిట్లా చిక్కి పోయావేమిటే! నీ కూతుర్నిగూడా తీసుకొచ్చావా! వీడు నీ చెల్లెలు కొడుగ్గదూ" అంటూ వచ్చిన వాళ్ళను కుశల ప్రశ్నలడిగారు...

వాళ్ళను అంతకుముందు నేనెప్పుడూ చూడనందువల్ల నాకు పరిచయం చేశారు దూరపు బంధువులంటూ...

శ్రీకాకుళం నుంచి వచ్చారు ... ఆ అమ్మాయికి సమ్బంధం ఏదో కుదిరిందట. పెళ్ళిచూపులు మద్రాసులోనె ఏర్పాటు చేసుకున్నారు... పిల్లవాడు శ్రీకాకుళం వెళ్ళేందుకు 'లీవు' దొరకనందువల్ల పిల్లనే తీసుకొచ్చారు... మా యింట్లోనే పెళ్ళి చూపులు జరిగే ఏర్పాటు చేసేశారు మా అత్తగారు..

ఆ పిల్లను చూస్తుంటే నాకు చాలా విచిత్రంగా కనుపించింది... నోరు మూసుకున్నప్పుడుగూడా కోరల్లా బయటికొచ్చి వంకర్లుతిరిగి భయంకరంగా కనుపించే రెండు పళ్ళతో ఆ అమ్మాయి ఎలామాట్లాడుతుందో, ఎలా నవ్వుతుందో నాకేం బోధపడలేదు.

ఉండబట్టలేక మా అత్తగారికి చెప్పాను పెళ్ళిచూపులకు ముందే ఆ పిల్లని ఏ పళ్ళ డాక్టరు దగ్గిరికో తీసుకెళ్ళి ఆ రెండు పళ్ళూ 'ఫైల్' చేయించేస్తే బాగుంటుందని...

"అయ్యొయ్యో! అపచారమే అపచారం. అట్లా అనకూడదు"...ఆ పిల్ల ఎవరనుకున్నావ్ !... సాక్షాత్తూ ఆ నరసింహస్వామి వరప్రసాదం... వాళ్ళఅబ్బపళ్ళూ, వాళ్ళ తాతపళ్ళూ యిట్లాగే వుంటాయి... వాళ్ళ కులదైవం నరసింహస్వామి వాళ్ళకు ప్రత్యక్షం! ఆయనపోలికలు వాళ్ళకు తరతరాలుగా వస్తున్నాయి. వాళ్ళ తాత సాక్షాత్తూ ఆ నరసింహావతారలావుండేవాడని అంతాఅంటారు. యింకెప్పుడూ అట్లాఅనకు... అంటూ తను లెంప లేసుకుని నన్నుకూడా వేసుకోమన్నారు... వేసుకున్నాను...

మర్నాడు సాయంకాలం పెళ్ళిచూపుల కొస్తారని యిల్లు శుభ్రం చేయించడానికి కాస్త త్వరగానే లేదారు మా అత్తగారు- లేస్తూనే మామూలు ప్రకారం పెళ్ళి కంస సంహారముందు నిలబడ్డారు... పెరటి



వైపు నుంచి ఆరంభం అయింది మంగళ వాద్యం ... మళ్ళీ ఆ కొత్తగా నేర్చుకొనేవాడే సరిగమల దగ్గిర్నుంచి రాగ ప్రస్తారం వరకూ వాడిష్టం వచ్చినట్లు ఏ పనీ తోచనివ్వకుండా చెడామడా అపశ్రుతులు వాయించి మా అత్తగారి నరాలు కొరకడం మొదలెట్టాడు. దానికి తగ్గట్టు ప్రొద్దుటే రావలసిన పనివాడూ, చాకలివాడూ యిద్దరూ రాలేదు పనికి ...

'వెధవ మేళం పెరటి వెనక జేరింది. రోజా వీడిట్లాగే వాయిస్తూంటే పిచ్చెత్తి యిల్లు విడిచిపారిపోవలసిందే' అని మా అత్తగారంటూంటే గాడిద అరిచింది ... దాని వెనకాలే వరస నాలుగు గాడిదలు అరిచాయి. మా అత్తగారిముఖం అదోలా అయిపోయింది ...

వెధవ గాడిదలు ... మంచిమాట అనుకున్నప్పుడు అరిచి చావ్వు ... అందుకే వీటిని గాడిదలన్నారు ... అయినా ఒకటికి నాలుగు గాడిదలయినాయి ... చాకలి గుంపు గూడా ఎక్కువైనట్టుంది యింటి వెనకాల' అని చిరాకు పడుతూ చాకలివాణ్ణి వెంటనే రమ్మనమని కబురుపెట్టారు. వాడింట్లో లేడన్నారు ...

'దొంగ వెధవలు ... ఎప్పుడు అవసరమో అప్పుడే రారు. అని ఆమె తిడుతూవుండగానే పనివాడు పట్టాభి వచ్చి వాకిట్లో నిలబడ్డాడు కండ్లు తుడుచుకుంటూ.

'ఏం రా! నీకేం రోగం వచ్చింది. ఇంట్లో పనివున్నప్పుడూ, బంధువులొచ్చినప్పుడూనా మీరిట్లా చేయాల్సింది!—' అంటూ కేక లేశారు.

పట్టాభి వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టాడు ...

'ఛీ ఛీ ప్రొద్దుటే వాకిట్లో శుభమా అంటూ ఏమిట్రా నీ ఏడుపూ!'

'అమ్మా ... మరే! మరే' అంటూ మళ్ళీ బావురుమన్నాడు పట్టాభి.

'ఛీ ఛీ! ఒరేయ్ సిగ్గదూ చెప్పేదీ! అవచ్చేదేదో ఏడవకుండా ఏడువు.'

'అమ్మా మరే మా చిన్నాన్న పోయాడు. ... ...'

'ఓరి దొంగ భడవా! వుండూ' అంటూ గబగబ లోపలికెళ్ళి పద్దు పుస్తకం పట్టుకొచ్చారు ... ...

'ఒరేయ్! నువ్వొట్టి దొంగ వెధవ్వని నాకు తెలుసురా! అందుకే యీ పుస్తకంలో రాశానుగుర్తుగా ... పోయిన నెలగాక ముందునెల్లో నేగదరా మీ చిన్నాన్న పోయాడని గోడుగోడున ఏడుస్తూ మూడు రోజులు పత్తా లేకుండా పోయినావ్!' ... అని మా అత్తగారడుగుతూంటే పట్టాభి వెలవెల బోయాడు ... వెంటనే తెప్పరిల్లి 'ఆయన మా యింకో చిన్నాయన ... యీన యింకో చిన్నాయన'. అన్నాడు నేలచూపులుచూస్తూ. వాడు చెప్పేవాలకం చూస్తే అసలు వాడికి చిన్నాన్నే లేడనీ, ఒకవేళ వుండినా ఎప్పుడో చచ్చిపోయి వుంటాడనీ, ఆ చచ్చినవాణ్ణే వీడికవసరం వచ్చినప్పుడల్లా చంపుతున్నాడనీ నాకు తోచింది ...

మా అత్తగారు పద్దు పుస్తకం మూసేసి ...

'ఒరేయ్ నువ్వేసే దొంగ వేషాలకి నేను 'లీ' వివ్వను ... ఈరోజు యింట్లో శుభకార్యంగూడా వుంది.' అన్నారు.

శుభకార్యం అనేసరికి మళ్ళీ వాడు ఏడుపు మొదలెట్టాడు ...

'ఛీ ఛీ ఛీ ఏమిట్రా యిదీ అపశకునంలాగా ! ...'

వెంటనే గోలగోలగా అరిచాయి మాయింటి ముందే పూలచెట్లల్లో ఆనందంగా విహరిస్తున్న నాలుగు గాడిదలు ...

వాటిని చూసి మా అత్తగారిఒళ్ళు భగ్గుమంది ...

'ఆ వెధవ రాకుండా కాంపౌండులోకి గాడిదల్ని తోలాడు ... ఇందుకే యిరుగూ పొరుగూ అన్నారు ... చాకలీ మంగలీ యింటి వెనకాల జేర్తే యిట్లాగే వుంటుంది లక్షణం ! ...' అని చాకలివాడిమీద మండిపడుతూ గాడిదల్ని తరిమేశారు ... ...

ఆ కోపంతోనే యింకా ఏడుస్తున్న పట్టాభిని పనిమానేసి సొమ్మునీ జీతం యిచ్చేసి పంపించేశారు

సాయంకాలం పిల్లను చు[illegible] పిల్లవాడూ, అతని [illegible] వచ్చారు. [illegible] అగదన్న సామెత ననుసరించి [illegible]


వాళ్ళకు మా అత్తగారు పచ్చిమంచి నీళ్ళుగూడా యివ్వలా... లక్ష్మీనరసింహమ్మను తీసుకొచ్చి పిల్లవాడికెదురుగావున్న సోఫాలో కూర్చొబెట్టారు మా అత్తగారు స్వయంగా ... అంతే ... పిల్లవాడులేచి నిలబడ్డాడు ... హాల్లో తగిలించిన ఫోటోలూ, పెయింటింగ్సూ చూట్టం మొదలెట్టాడు... మా అత్తగారు అయోమయంగా నా వైపుచూశారు. పిల్లవాడి తల్లీ చెల్లెలూ గూడా లేచి నిలబడి "వెళ్ళొస్తాం"... అన్నారు ...

"పిల్ల నచ్చినట్టేనా"? అని అడిగారు మా అత్తగారు...


పాపం ఆవిడకి ఏంజెప్పాలోతెలీక కాసేపు అవస్థపడ్డది...

"ఆ నచ్చడానికేముందిగానీ... ఏ సంగతీ పిల్లవాణ్ణి కనుక్కొని మీకు చెప్తాను" అంటూ ఒక్కక్షణం గూడా ఆలస్యం జేయకుండా పిల్లవాడితోసహా వెళ్ళి కార్లో కూర్చున్నారు... మా అత్తగారూ నరసింహమ్మ తల్లీ ఒకర్నొకరు చూస్తూ నిలబడి పోయారు...

కాసేపటికి నరసింహమ్మ కొక కోరిక కలిగింది. పక్కనేవున్న స్టుడియోకెళ్ళి షూటింగెట్లావుంటుందో చూడాలని... ఆ పిల్లకోసం మా అత్త







గారు నన్నుకూడా రావాలన్నారు షూటింగ్ చూట్టానికి... నలుగురం బయల్దేరాం... స్టుడియో కెళ్ళాం...

ఏదో పెద్ద భవనంలాంటి దాని ముందు జనం గుంపులుగా నిలబడి జమీందారుగారికీ జై" అంటూ చేతులెత్తి అరుస్తున్నారు... చాలాసేపు వాళ్ళనే చూస్తూ కూర్చున్నాం...

"పెద్ద యాక్టర్లెవరూ లేనట్టుందే! ఏం ఫిలుంయిదీ! యీ గుంపుతో యింతసేపు తీస్తున్నారూ" అంటూ విసుక్కున్నారు మా అత్తగారు...

ఉన్నట్టుండి గుంపులో ఎవర్నో పసిగట్టారు మా అత్తగారు... పట్టున నా చేతిమీదకొట్టి చెవిదగ్గరకొచ్చి చెప్పారు...

"ఒసేవ్ అటుజూడు! ఆగుంపులో మన చాకలాడు వేషంగట్టాడే! అడుగో! వాడిపక్కనే మన పనివెధవ పట్టాభిగూడా వున్నాడు చూడు!... అని ఆమె చెపుతూంటే పరకాయించి చూశాను... నిజమే! చాకలివాడూ పట్టాభీ యిద్దరూ మొగానికింత పౌడరు పూసుకుని వాళ్ళ బట్టల్తోనే జాలీగా సిగరెట్లు తాగుతూ ఏవో కబుర్లు చెప్పకుంటూ నవ్వుకుంటున్నారు యీ ప్రపంచాన్ని మర్చిపోయి...

"హారి దొంగ వెధవల్లారా!... చూశావటే! అందుకే యీ వెధవలు పని ఎగ్గొట్టారు... సినిమాల్లో వేషాల కోసంవచ్చి పొట్టుకరక్క ఏవో

వన్లో చేర్చుంటారు... యిట్లా అయితే మనకింక పనివాళ్ళేం దొరుకుతారు! మన యింటి పాచిపని మనం చేసుకోవాల్సిందే!" అని మా అత్తగారంటూంటే గుంపులోంచి గాడిద అరిచింది... మా అత్తగారు ఆశ్చర్యపడిపోతూ "వాడేకా దేవ్! వాడిగాడిద కూడా వేషం గట్టింది... బాగానే వుంది షూటింగు... యీ గాడిదల్ని చూట్టానికా మనం వచ్చింది!... పదండి పోదాం" అంటూ బయల్దేరారు మా అత్తగారు...

నరసింహమ్మ మద్రాసు బీచీ చూడాలని ఉబలాటపడ్డది. కారు బీచీవైపుకు పోనిమ్మన్నారు డ్రైవర్ను మా అత్తగారు.

కారు బీచీరోడ్డులో పోతూంది...

సడన్‌గా మా అత్తగారు వెనక్కి తిరిగిచూసి కారు ఆపమన్నారు.

మేమంతా తిరిగి చూశాం... నరసింహమ్మను చూట్టానికి వచ్చిన పెళ్ళికొడుకు ఎవరో అందమైన అమ్మాయితో ఖులాసాగా కబుర్లాడుతూ నడుంచుట్టూ చెయ్యివేసి నడిపించుకుంటూ పోతున్నాడు ... చూడముచ్చటగా వున్నారు వాళ్ళిద్దరూ నడుస్తూంటే. నరసింహమ్మ తల్లి కోపంతో ముఖం యింకోవైపుకు తిప్పుకుంది... మా అత్తగారు తన ముఖం నావైపుకు తిప్పారు ...తక్షణం నా ఎక్స్‌ప్రెషన్ మారింది.

□□□

---

- కాలేజి యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి రాబోయే వార్షికోత్సవం గురించి మాట్లాడుకుంటున్నారు :

  "ఇంకెవర్ని పిలిచినా ఫస్టుక్లాసు చార్జీలు పెట్టుకోవాలిగనుక యీసారి మన సభలకి వినోబాభావేగార్ని పిలుద్దాం" అన్నాడు అధ్యక్షుడు.

  "ఐతే మన వార్షికోత్సవం వచ్చేయేటికి వాయిదా వేద్దాం."

- ఇద్దరు స్నేహితులు ఒక డిటెక్టివ్ రచయితనిగురించి మాట్లాడుకుంటున్నారు :

  "అతను తను రాయబోయే కథ చెప్పనన్నాడు. చెబితే సస్పెన్స్ పోతుందట."

  "ఔనే. కథ అతనికే తెలియదు. తెలిస్తే, రాస్తుంటేనే సస్పెన్స్ పోతుందిగా."

—నరసింహాబాబు, సి. ఏ. వి., అనంతపురం.



# మరో ప్రపంచం

"మరో ప్రపంచం మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది"

అని 1934 లో శ్రీశ్రీ మహాప్రస్థాన గేయం రాసినప్పుడు ఈ స్వప్నం మరో అర్థంలో రుజువవుతుందని ఆయన ఊహించి వుండడు.

ఈ మధ్య ఇద్దరు సోవియట్ శాస్త్రజ్ఞులు కనిపెట్టిన విషయం మహాశ్చర్యకరమైంది. విశ్వాంతరాళంలో ఎక్కడో కొన్నివేల కోట్ల మైళ్ళ దూరంలో మరో ప్రపంచం వుందని, అందులో మానవ నాగరికత కంటె విశిష్టమైన మరో నాగరికత వర్ధిల్లుతోందని వారు కనిపెట్టారు. ఆ దూర ప్రపంచం నుంచి "సిటిఎ — 102" అనే సాంకేతిక నామం కలిగిన రేడియో తరంగాలు భూమిమీదికి వస్తున్నాయట. వాటిలో హెచ్చుతగ్గులు ప్రతి వందరోజులకీ ఒకసారి ఒక నిర్ణీతపద్ధతిలో పునరావృత్తం కావడంచేత వాటి నెవరో కావాలనే పంపిస్తూ వుండివుండాలి. కొన్నికోట్ల కాంతిసంవత్సరాలదూరం నుంచి ఆ రేడియో తరంగాలను పంపించగలిగిన ఆ జాతి ఏదో మానవులకంటె మహత్తరమైనదే అయి వుండాలి. ఇదీ సోవియట్ శాస్త్రజ్ఞుల ఊహాగానం. కేవలం ఊహాగానమే కాదు. ఖచ్చితంగా అలాంటి ప్రపంచం వుండివుంటుందని వారు నమ్మకంగా చెబుతున్నారు.

ఐతే, సోవియట్ శాస్త్రజ్ఞులు కనిపెట్టిన రేడియో తరంగాలు, వాటి స్వభావం మొదలైన వేవీ సరిగ్గా పరిశోధించకుండా, వారు చెప్పేది నిజమో కాదో చెప్పలేమని పాశ్చాత్యశాస్త్రజ్ఞులు అంటున్నారు.

కొంతమంది "ఆ, ఇవన్నీ కాకమ్మ కథలు" అని తోసేస్తున్నారు.

ఒకప్పటి కాకమ్మకథలే యీనాడు నిజాలవుతున్నాయి కనుక సోవియట్ శాస్త్రజ్ఞులు కనిపెట్టింది ఎప్పటికో రుజువు కాకూడదని ఏముంది ? మన ప్రపంచానికి, మరో ప్రపంచానికి మధ్యఏనాటికో రాకపోకలు కాకపోయినా, కనీసం రేడియో సంబంధాలైనా ఏర్పడతాయేమో. అక్కడి వారిని మనం టెలివిజన్ తెరపైనైనా చూడగలుగుతామేమో.

రోదసీ నౌకలో కూర్చుని భూమి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న మనిషిని